క్లుప్తంగా

వేడుకగా శివపార్వతుల కల్యాణం రాట



రాట మహోత్సవంలో పాల్గొన్న నిర్వాహకులు, స్థానికులు

మునగపాక: మండలంలోని పాటిపల్లిలో శనివారం శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో కల్యాణం రాట మహోత్సవం నిర్వహించారు. ఈనెల 25న శివపార్వతుల కల్యాణం ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఆరోజు ఆలయ ప్రాంగణంలో భారీ అన్న సమారాధన జరుగుతుందని, భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి కల్యాణం తిలకించాలని కోరారు.

గురుస్వామి జోగారావుకు సత్కారం



గురుస్వామి జోగారావును సత్కరిస్తున్న శివస్వాములు

మునగపాక: మునగపాకలోని గురుస్వామిని శివస్వాములు శనివారం ఘనంగా సత్కరించారు. కార్తీకమాసంలో భాగంగా మాలలు ధరించిన భక్తులు సాంబశివుని ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. గురుస్వామి మాడెం జోగారావు నేతృత్వంలో ఉదయం, రాత్రి స్వామివారికి అభిషేకాలు నిర్వహిస్తూ వస్తున్నారు. దీనిలో భాగంగా గురుస్వామి జోగారావుకు మెమెంటో అందజేసి శాలువాతో సత్కరించారు.

చురుగ్గా పారిశుధ్య పనులు



కె.వెంకటాపురంలో చెత్త తరలిస్తున్న కార్మికుడు

కోటవురట్ల: కె.వెంకటాపురంలో శనివారం పారిశుధ్య కార్మికులు వీధులను శుభ్రపరిచి, డ్రైనేజీలలో పూడిక తీశారు. ఇళ్ల నుంచి చెత్తను సేకరించి గ్రామ శివారున ఉన్న సంపద కేంద్రాలకు తరలించారు. సర్పంచ్ పైల శ్రీదేవి మంగా ఇందిర భవానీ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పారిశుధ్యం మెరుగునకు సహకరించాలని కోరారు.

ప్రభుత్వ పాఠశాలల పని వేళల మార్పు సరి కాదు

అచ్యుతాపురం: ప్రభుత్వ పాఠశాలల పనివేళలు మార్పు చేయడం సరి కాదని ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షురాలు వి.లక్ష్మి అన్నారు. మండల యూటీఎఫ్ కార్యవర్గ సమావేశాన్ని అచ్యుతాపురం ప్రాథమిక పాఠశాల ఆవరణలో శనివారం సాయంత్రం నిర్వహించారు. అనంతరం మండల యూటీఎఫ్ నూతన కార్యవర్గాన్ని ఏక గ్రీవంగా ఎన్నుకున్నారు. అచ్యుతాపురం యూటీఎఫ్ మండల అధ్యక్షునిగా మద్దిల నానాజీ, ప్రధాన కార్యదర్శిగా కాకిలేటి సుభాషిణీ దేవి, గౌరవ అధ్యక్షుడిగా కొంకి మహిమారావు, సహ అధ్యక్షులుగా ఆర్.రవి కుమార్, సూర్యలక్ష్మి, సీపీఎస్ కన్వీనర్‌గా ఈ. అరుణకుమారిని ఎన్నికల అధికారి జి. చినబ్బాయి సమక్షంలో ఎన్నుకున్నారు. జి.ఎస్. ప్రకాశ్, వి.జాషువా, ఎన్.కళ్యాణరావు, కె.మురళీకృష్ణ, నీరజ, పారిజాతం, ఝాన్సీ, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఇంటి పన్ను వసూళ్లపై దృష్టి సారించాలి



మాట్లాడుతున్న ఈవోఆర్డీ సోమరాజు

మునగపాక: ఇంటి పన్ను వసూళ్లపై దృష్టి సారించాలని ఈవోఆర్డీ ఎం.సోమరాజు కోరారు. శనివారం మండల పరిషత్ హాలులో పంచాయతీ కార్యదర్శులతో సమావేశమయ్యారు. గ్రామాలాభివృద్ధిపై ప్రతి ఒక్కరూ దృష్టి సారించాలన్నారు. పారిశుధ్యం, వీధి దీపాలు, తాగునీటి వనరులకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. సమావేశంలో పలువురు కార్యదర్శులు పాల్గొన్నారు.

తప్పుడు పనులకు షెల్టర్లు



చోరీకి గురైన విద్యుత్ పరికరాలు

- అసాంఘిక కార్యకలాపాలకు **అడ్డాగా** తుపాను రక్షిత భవనాలు
- ప్రభుత్వ ఆశయానికి తూట్లు



అధ్వానంగా ఉన్న మరుగుదొడ్లు



పాటిమీద గ్రామంలో లక్షల వ్యయంతో నిర్మించిన తుపాను రక్షిత భవనం

తీరప్రాంత గ్రామాల్లో లక్షలు వెచ్చించి నిర్మించిన తుపాను రక్షిత భవనాలు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారాయి. అధికారులు పట్టించుకోకపోవడంతో ఈ భవనాల్లో సంఘ వ్యతిరేక కార్యక్రమాలు, మందుపార్టీలు జరుగుతున్నాయన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. తుపాన్లు, ప్రకృతి వైపరీత్యాలు సంభవించినపుడు తీరప్రాంతాలను అనుకుని నివసిస్తున్న వారిని తరలించి ప్రమాదాల బారి నుంచి కాపాడేందుకు ఈ భవనాలు నిర్మించారు. అయితే ప్రభుత్వ ఆశయాలకు తూట్లు పొడుస్తూ ఈ భవనాల్లో మందు పార్టీలు, అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి.

నక్కపల్లి: పాయకరావుపేట నియోజకవర్గంలో ఎస్.రాయవరం, నక్కపల్లి, పాయకరావుపేట మండలాల్లో సుమారు 30 కిలోమీటర్ల తూర్పు తీరం విస్తరించి ఉంది. దాదాపు 27 మత్స్యకార గ్రామాలున్నాయి. సుమారు 25 వేలకు పైగా మత్స్యకారులు ఈ గ్రామాల్లో జీవిస్తున్నారు. నక్కపల్లి మండలంలో పాటిమీద, మూలపర, అమలాపురం, రాజయ్యపేట, బంగారయ్యపేట, ఎస్.రాయవరం మండలంలో రేవుపోలవరం, బంగారమ్మపాలెం, పాయకరావుపేట మండలంలో పాల్మన్‌పేట, వెంకటనగరం, రాజవరం, రాజానగరం, కొర్లయ్యపేట, కేశవరం, పెంటకోట తదితర గ్రామాల్లో ప్రభుత్వం కోట్లాది రూపాయలు ఖర్చు చేసి మూడంతస్తుల తుపాను రక్షిత భవనాలు నిర్మించింది. ఒక్కొక్క భవనానికి కోటి రూపాయలు పైగానే కేటాయించారు. విశాలమైన గదులు, ఆధునికమైన మరుగుదొడ్లు, ప్రహరీలు తదితర సదుపాయాలు కల్పించారు. లోతట్టు ప్రాంతాలకు చెందిన వారిని ఈ భవనాలకు తరలించి భోజనం, వసతి సదుపాయాలు కల్పిస్తారు. ఒకేసారి సుమారు 500 మందికి పైగా ఈ భవనాల్లో రక్షణ కల్పించవచ్చు. ఇటువంటి భవనాలపై ప్రస్తుతం పర్యవేక్షణ కొరవడింది. ఆలనా పాలనా లేకపోవడంతో అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారాయి. మందుబాబులు ఈ భవనాలను తమ అడ్డాలుగా మార్చుకున్నారు. రాత్రి వేళల్లో మద్యం పార్టీలు, అశ్లీల కార్యకలాపాలు జరుగుతున్నాయన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. భవనాల్లోకి వెళ్తే తాగి పడేసిన మద్యం బాటిళ్లు, సిగరెట్ పీకలు, కండోమ్స్, బిరియానీ పొట్లాలు దర్శనమిస్తున్నాయి. తుపాను హెచ్చరికల సమయంలో తప్ప మిగిలిన సమయాల్లో వీటి వైపు అధికారులు సైతం కన్నెత్తి చూడటం లేదు. ఖరీదైన టైల్స్, కమోడ్లతో నిర్మించిన మరుగుదొడ్లు అధ్వానంగా ఉన్నాయి. భవనాలకు ఏర్పాటు చేసిన విద్యుత్ పరికరాలు చోరీకి గురవుతున్నాయి.



భవనం లోపల ఖాళీ మద్యం సీసాలు

మత్స్యకారులకు సంబంధించి సంక్షేమ కార్యక్ర**మాలు పర్యవేక్షిం**చాల్సిన మత్స్యశాఖ అధికారులు **వీటిని ఎప్పటికప్పు**డు పరిశీలించాలి. రెవెన్యూ, **పంచాయతీరాజ్** శాఖల అధికారులు వీటిని పర్యవే**క్షించాలి. కానీ ఈ** మూడు శాఖల మధ్య సమ**న్వయం లేకపోవ**డంతో ఈ భవనాలు సంఘ **వ్యతిరేక కార్యకలా**పాలకు నిలయంగా మారాయి. ఇకనైనా అధికారులు స్పందించి తుపాను రక్షిత భవనాలపై దృష్టి సారించి వాటిలో జరిగే అసాంఘిక కార్యకలాపాలను అరికట్టాలని స్థానికులు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం..



తుపాను రక్షిత భవనాల స్థితిగతులపై రెవెన్యూ, పంచాయతీరాజ్, మత్స్యశాఖ అధికారులతో కలిసి చర్యలు చేపడతాం. వీఆర్వో, కార్యదర్శి, మత్స్యశాఖ సిబ్బంది సాయంతో బయటి వ్యక్తులు ప్రవేశించకుండా రక్షణ కల్పిస్తాం. ప్రభుత్వ భవనాల్లో సంఘ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చట్టప్రకారం చర్యలు తీసుకుంటాం. తక్షణమే భవనాలకు తాళాలు వేసి ఇతర వ్యక్తులు ప్రవేశించకుండా కట్టడి చేస్తాం.

– నర్సింహమూర్తి, తహసీల్దార్, నక్కపల్లి

నూకాలమ్మకు ప్రత్యేక పూజలు



అన్నసమారాధన నిర్వహిస్తున్న నాయకులు

పాయకరావుపేట: మండలంలో గల మంగవరం గ్రామంలో నూకాలమ్మ అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. నూకాలమ్మ తల్లిని ప్రతిష్ఠించిన రోజు సందర్భంగా ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నసమారాధన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ వంగలపూడి సరస్వతీ రామారావు, పీఏసీఎస్ మాజీ చైర్మన్ దేవవరపు రాజేష్ ఖన్నా, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు కోనే పుత్రరావు, కోనే వెంకట శ్రీను, కోనే అయ్యారావు, గాబు శివ, కోనే కొండలరావు, రామకృష్ణ, దేవవరపు నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

కుక్కల దాడిలో పెయ్యి మృతి



మృతి చెందిన పెయ్యి

మునగపాక: మండల వ్యాప్తంగా కుక్కల దాడులు పెరిగిపోతున్నాయి. దీంతో పెయ్యిలు గాయాల పాలై మృతి చెందుతున్నాయి. గత కొద్ది రోజులుగా కుక్కలు గుంపులుగా తిరుగుతూ రాత్రి వేళల్లో పెయ్యిలపై దాడులు చేస్తున్నాయి. దీనిలో భాగంగా మునగపాకకు చెందిన దాడి రాము గేదె పెయ్యిపై కుక్కలు దాడి చేయడంతో మృతి చెందింది. అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

పారిశుధ్యం మెరుగునకు కృషి చేయాలి



పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న డీపీవో శిరీషారాణి

మునగపాక: ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని డీపీవో శిరీషారాణి కోరారు. స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమంలో భాగంగా శనివారం మునగపాకలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ప్రతి శనివారం అధికారులు, ప్రజా ప్రతినిధులు పారిశుధ్యం మెరుగునకు కృషి చేయాలన్నారు. తాగునీరు, వీధి దీపాల నిర్వహణతో పాటు పారిశుధ్యం మెరుగుపడేందుకు పాటుపడాలన్నారు. డీపీఆర్‌సీ కో–ఆర్డినేటర్ నాగలక్ష్మి, ఎంపీడీవో ఎం.ఉషారాణి, ఈవోఆర్డీ ఎం.సోమరాజుతో పాటు పలువురు పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి సహకరించాలి



తుప్పల తొలగింపు పనులను పరిశీలిస్తున్న సర్పంచ్ ధనలక్ష్మి

మునగపాక: టి.సిరసపల్లి గ్రామాభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని సర్పంచ్ మద్దాల ధనలక్ష్మి కోరారు. టి.సిరసపల్లి నుంచి త్రిమూర్తుల గుడి వరకు రోడ్డుకు ఇరువైపులా పేరుకుపోయిన తుప్పలను శనివారం జేసీబీ సాయంతో తొలగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పరవాడ రోడ్డు ఇరుగ్గా ఉండడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని ఈ నేపథ్యంలో తుప్పలు తొలగిస్తున్నామన్నారు. ఆమె వెంట ఎంపీటీసీ సభ్యుడు మద్దాల వీరునాయుడు ఉన్నారు.

దాతల సహకారం సద్వినియోగం చేసుకోవాలి



విద్యార్థులకు క్రీడా దుస్తులు అందజేస్తున్న దాత

ఎస్.రాయవరం: దాతల సహకారం సద్వినియోగం చేసుకుని విద్యార్థులు విద్య, క్రీడల్లో రాణించాలని వైఎస్సార్‌సీపీ నాయకుడు, గుడివాడ మాజీ సర్పంచ్ పేరిచర్ల శ్రీపతిరాజు అన్నారు. గ్రామానికి చెందిన పేరిచర్ల శ్రీరామ్మూర్తి సమకూర్చిన క్రీడా దుస్తులు 20 మంది విద్యార్థులకు అందజేశారు. అలాగే మరో దాత జిజ్జురి సతీష్ బీరువా, కంప్యూటర్, ప్రింటర్ అందజేశారు. ఈ మేరకు ప్రధానోపాధ్యాయులు పి.నాగన్నదొర, వ్యాయామ ఉపాధ్యాయులు కుందూరు రాజు దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు రాముగరాజు, అచ్యుత రామరాజు, రామకృష్ణంరాజు, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ బొట్టా బాలాజీ, గ్రామస్తులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

పట్టణ పరిశుభ్రతే లక్ష్యం



తుప్పలు తొలగిస్తున్న మున్సిపల్ అధికారులు, సచివాలయ సిబ్బంది

యలమంచిలి రూరల్: పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచడమే లక్ష్యంగా స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమం చేపడుతున్నామని మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ పల్లా శ్రీనివాసరావు అన్నారు. ప్రతి శనివారం మున్సిపల్ అధికారులు, సచివాలయ ఉద్యోగులతో పట్టణంలో మాస్ క్లీన్లినెస్ ప్రోగ్రాం నిర్వహిస్తున్నామని ఆయన చెప్పారు. శనివారం పట్టణంలోని ఫైర్ ఆఫీస్ కాలనీలో అంగన్‌వాడీ కేంద్రం సమీపంలోని ఖాళీ స్థలంలో తుప్పలు, వ్యర్థాలు తొలగించారు. ఈ సందర్భంగా తడి,పొడి చెత్త వేరు చేయడంపై స్థానికులకు పారిశుధ్య సిబ్బంది అవగాహన కల్పించారు.

రైతు, కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పి కొట్టాలి



అచ్యుతాపురంలో నినాదాలు చేస్తున్న సీఐటీయూ సభ్యులు

మునగపాక: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న రైతు, కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పి కొట్టాలని రైతుసంఘం నాయకుడు కర్రి అప్పారావు కోరారు. శనివారం రాత్రి మునగపాక, సంతబయిలు రైతు సంఘాల నేతలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంయుక్త కిసాన్ మోర్చా, కార్మిక సంఘాల ఐక్యవేదిక పిలుపు మేరకు 26వ తేదీన దేశవ్యాప్త ఆందోళనలు నిర్వహిస్తున్నామన్నారు. ప్రజలపై భారం మోపడం అన్యాయమన్నారు. పంటలకు గిట్టుబాటు ధరలు లేవని అలాగే నిత్యావసర సరుకుల ధరలు ఆకాశన్నంటుతున్నాయన్నారు. కార్యక్రమంలో సదాశివరావు, టెక్కలి రమణబాబు, బొడ్డేడ త్రినాథ్, విల్లూరి షకిరుమనాయుడు, పాలిమేర కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రైతులు, కార్మికులను ఆదుకోవడంలో కేంద్రం విఫలం..

అచ్యుతాపురం: దేశాభివృద్ధికి తోడ్పడుతున్న రైతులు, కార్మికులను ఆదుకోవడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమయ్యిందని సీఐటీయూ మండల కన్వీనర్ కె. సోమునాయుడు అన్నారు. అచ్యుతాపురంలో సీఐటీయూ మండల కమిటీ సభ్యురాలు బి.జయ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 26న జిల్లా కేంద్రాల్లో మహా ధర్నాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మంగ, లావణ్య, రమణ, శ్రీరాములు, మణి పాల్గొన్నారు.

జగ్గన్నపేటలో గైరమ్మ సారె ఊరేగింపు

అచ్యుతాపురం: మండలంలోని జగ్గన్నపేటలో గైరమ్మ సారె ఊరేగింపు శనివారం నిర్వహించారు. గ్రామంలోని ముత్తయిదువులు పిండి వంటలు వండి సారెకు సమర్పించారు. ఈ కార్యక్రమంలో దొడ్డి కృష్ణ, సమరసతా సేవా ఫౌండేషన్ మండల కన్వీనర్ ఆడారి త్రినాథ్, మళ్ల బుజ్జి, గోవింద, బుద్ధ వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సత్య సాయిబాబా జయంతి

మునగపాక: మండలంలోని తిమ్మరాజుపేటలో శనివారం శ్రీ సత్యసాయి బాబా 99వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. సత్యసాయి భజన మండలి అధ్వర్యంలో ఉదయం మహానగర సంకీర్తన, ఓంకార సుప్రభాతం నిర్వహించారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో భక్తులకు నారాయణ సేవ నిర్వహించారు. బాల వికాస్ పిల్లలచే పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో సత్యసాయి భజన మండలి కన్వీనర్ సరిశా శివ, అప్పలనాయుడు, సాయిరాం, పలువురు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన మహోత్సవాలు..

అచ్యుతాపురం: శ్రీ సత్యసాయి బాబా 99వ జన్మదిన మహోత్సవాలు శనివారంతో ముగిశాయి. హరిపాలెం–అందలాపల్లి శ్రీ సత్యసాయి భజన మండలి ఆధ్వర్యంలో నిర్వహించిన ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో భాగంగా నగర సంకీర్తన, పల్లకీ సేవ, అన్న ప్రసాద వితరణ చేపట్టారు. చీమలాపల్లి శ్రీ బాలవికాస్ విద్యార్థులచే నిర్వహించిన కోలాటం ఆకట్టుకుంది.దుప్పట్ల పంపిణీ, మహా నారాయణ సేవ నిర్వహించారు.

నేడు బండిమాంబ అమ్మవారి జాతర



యలమంచిలి రూరల్: ఉత్తరాంధ్ర జిల్లాల ఇలవేల్పు ఏటికొప్పాక బండిమాంబ అమ్మవారి జాతర ఈనెల 24వ తేదీ ఆదివారం జరగనుంది. ఇందుకు సంబంధించి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో విస్తృత ఏర్పాట్లు చేపడుతున్నారు. ఏటికొప్పాక బండిమాంబ అమ్మవారి జాతరను తిలకించేందుకు ఉమ్మడి విశాఖ జిల్లా సహా అనేక ప్రాంతాల నుంచి వేల సంఖ్యలో భక్తులు ఏటికొప్పాక తరలి వస్తారు. ఆలయ పరిసర ప్రాంతాల్లో భారీ లైటింగ్ ఏర్పాటు చేశారు. ఆలయాన్ని అందంగా తీర్చిదిద్దారు.

పదిలో శతశాతం ఉత్తీర్ణత సాధించాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న డిప్యూటీ డీఈవో అప్పారావు

ఎస్.రాయవరం: వత్తిడిని జయించి 10వ తరగతి విద్యార్థులు బాగా చదవాలని డిప్యూటీ డీఈవో పి.అప్పారావు అన్నారు. పెదగుమ్మలూరు ఉన్నత పాఠశాలను శనివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులతో మాట్లాడి వారి సామర్థ్యాలు తెలుసుకుని సంతోషించారు. అదే క్రమంలో విద్యార్థులు ఆపార్ ఐడీలు త్వరితగతిన చేయించుకునేలా చూడాలని సూచించారు.

వచ్చే నెల 4న రాష్ట్రస్థాయి పాటల పోటీలు

యలమంచిలి రూరల్: గాన గంధర్వుడు ఘంటసాల వెంకటేశ్వరరావు 102వ జయంతి సందర్భంగా డిసెంబర్ 4న యలమంచిలిలో ఘంటసాల కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి పాటల పోటీలు నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ అధ్యక్షుడు ఆడారి పూరీ జగన్నాథం శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 15 ఏళ్ల వయసు లోపు ఉన్న వారిని జూనియర్లుగా, 15 ఏళ్లు దాటిన వారిని సీనియర్లుగా పరిగణించి పోటీలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. ప్రథమ బహుమతి రూ.5 వేలు, ద్వితీయ బహుమతి రూ.3 వేలు, తృతీయ బహుమతి రూ.2 వేలు, కన్సొలేషన్ బహుమతులు ఉంటాయని పేర్కొన్నారు. పోటీల్లో పాల్గొనే వారు ఘంటసాల పాడిన పాటలు, ఆయన సంగీత దర్శకత్వం వహించిన పాటలు మాత్రమే పాడాలని సూచించారు. వివరాలకు యువీఎస్ కొండలరావు, సాంబశివరావు 9110 769864, 9390877174 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

గ్రామాల అభివృద్ధిపై దృష్టి సారించాలి

మునగపాక: గ్రామాల అభివృద్ధిపై దృష్టి సారించాలని ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ కోరారు. శనివారం రాత్రి మునగపాక జనసేన కార్యాలయంలో కూటమి నాయకులతో ఆయన సమావేశం నిర్వహించారు. రహదారులు, డ్రైనేజీలపై దృష్టి సారించాలన్నారు. ఎంపీపీ మళ్ల జయలక్ష్మి, కూటమి నేతలు దాడి ముసిలినాయుడు, దొడ్డి శ్రీనివాసరావు, టెక్కలి పరశురామ్, ఏవీ సత్యనారాయణ, డాక్టర్ బద్దెం సూర్యనారాయణ, మొల్లేటి సత్యనారాయణ, డొక్కా నాగభూషణం పాల్గొన్నారు.

సర్వసభ్య సమావేశంలో నూతన కమిటీ ఎన్నిక



యూటీఎఫ్ నూతన కార్యవర్గ సభ్యులు

పాయకరావుపేట: మండల యూటీఎఫ్ సర్వసభ్య సమావేశం పట్టణంలో గల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుల సమస్యల గురించి చర్చించారు. ఈ సమావేశంలో భాగంగా జిల్లా కోశాధికారి రాజేష్ ఆధ్వర్యంలో పాయకరావుపేట మండల నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా కోడి నానాజీ, అధ్యక్షుడిగా కట్టా శ్రీరామచంద్రమూర్తి, ప్రధాన కార్యదర్శిగా బి.వి.వి.రమణ, కోశాధికారిగా గర్లంక వెంకట సతీష్, సహాధ్యక్షులుగా కట్టా శ్రీను, ఎం.నాగరాజు, జిల్లా కౌన్సిలర్లుగా కేఎస్ఆర్‌కే రాజు, జీఈ గోపాలరావు, ఎం.రామలక్ష్మి, ఎ.శ్రీనివాసరావు, జేవీఎస్‌పీ రాజేష్, గర్లంక వాసు, మండల కార్యదర్శులుగా ఎంటీ ఫణికుమార్, ఆదినారాయణ, ప్రసాద్, జె.చినబాబు, కోటేశ్వరి, ప్రసునాంబ, సీపీఎస్ కమిటీ కన్వీనర్‌గా పి.ఫణీంద్రకుమార్, ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా కె.గణపతి, కల్చరల్ కమిటీ కన్వీనర్‌గా కేవీవీ రామారావు, ప్రచార కమిటీ కన్వీనర్‌గా డీబీకే తదితరులను ఎన్నుకున్నారు.

అభివృద్ధే ధ్యేయంగా పని చేయాలి



మాట్లాడుతున్న ఎంపీడీవో జయప్రకాష్‌రావు

పాయకరావుపేట : గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా అధికారులు, సర్పంచ్‌లు పని చేయాలని మండల పరిషత్ అభివృద్ధి అధికారి జయప్రకాష్‌రావు అన్నారు. శనివారం సత్యవరం, పాయకరావుపేట గ్రామాల్లో పరిశుభ్రత కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ వీధుల్లో చెత్త లేకుండా ఉండాలని, డ్రైనేజీలు ఎప్పటికప్పుడు తీయించాలన్నారు. అదే విధంగా చెత్త నుండి సంపద కేంద్రాలు అభివృద్ధి చేయాలన్నారు. ప్రతి గ్రామ పంచాయతీ స్వర్ణ పంచాయతీగా తీర్చిదిద్దాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఈవోఆర్‌డీ సీహెచ్ చంద్రశేఖర్, గ్రామ సర్పంచ్ సకిలేటి రాము, మండల పరిషత్ సూపర్‌వైజర్ వర్మరాజు తదితరులు పాల్గొన్నారు.

చురుగ్గా వ్యవసాయ పనులు



పాములవాకలో సరుగుడు నారులో కలుపు తీస్తున్న కూలీలు

కోటవురట్ల: వాతావరణం అనుకూలంగా ఉండడంతో మండలంలో వ్యవసాయ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. పలు ప్రాంతాలలో కలుపుతీత పనులు చురుగ్గా నిర్వహిస్తున్నారు. పాములవాకలో సరుగుడు నారు మడుల్లో చురుగ్గా కలుపు తీత పనులు చేపట్టారు. రైతులు, వ్యవసాయ కూలీలు ఈ పనుల్లో చురుగ్గా పాల్గొంటున్నారు.